# ఇంత - అంత

తిక్కల రాజాగారు కుక్కల్ని వెంటబెట్టుకుని బజారు బయల్దేరారు. రాజాగారి ఆంతరంగికుడు భద్రం కూడా వెంటనే వున్నాడు.

మార్కెట్ దగ్గరకొచ్చేటప్పటికి, ముక్కుపుటాలెగరేస్తూ, మువ్వన్నె గుర్రం ఆగిపోయింది.

"భద్రం! ఏమిటయ్యా ఏం జరిగింది?"

"చిత్తం! మహాప్రభో! గుర్రం ఆగిపోయిందండి."

"ఎందుకని?"

"ముక్కులు భరించలేని వాసనచేత ప్రభూ" ముక్కు మూసుకుని ముక్కుతో మాట్లాడసాగాడు భద్రం.

"ఏమిటా వాసన భద్రం?" కళ్ళు మూసుకుని ఆలోచిస్తూ అడిగాడు రాజావారు.

"మిగిలిపోయిన కూరగాయలు బయటపారేయడంతో - అవి కుళ్ళిపోయి వచ్చే వాసన ప్రభో" అని చెప్పి నోరు కూడా మూసేసుకున్నాడు భద్రం.

భద్రాశ్వం ఇక భరించలేక వెనక్కి తిరిగింది.

రాజావారికి కోపం పెరిగిపోయింది.

"కూరగాయలు పారేయడానికిటోయ్ భద్రం మనం పండిస్తున్నది?" ప్రశ్నించారు రాజావారు.

"లేదు మహాప్రభో! తిని పారేయడానికి పండిస్తున్నాం" ఆయాస పడుతూ అన్నాడు భద్రం.

"శభాష్! వెంటనే ఓ పని చెయ్యి! రేపటి నుంచీ మార్కెట్‌కి ఒక్క కూరగాయ కూడా వెళ్ళడానికి వీల్లేదు. అన్నీ కొని మన కోట స్టోర్ రూమ్‌లో భద్రం చేసెయ్! అప్పుడు తెలిసొస్తుంది ప్రజలకి వాటి విలువ."

"చిత్తం."

* * *

నెల రోజుల తర్వాత రాజావారితోపాటు హృద్యమైన ఫ్రెంచి మద్యం సేవిస్తున్న రాజావారి కుక్కలు ముక్కులు ఎగబట్టి - చిరాగ్గా లోగొంతుకలో మూలగసాగాయి.

"భద్రం! ఏమిటోయ్ వీటి గోల?"

ముక్కుకి పెంటుగుడ్డ కట్టేసిన భద్రం వినయంగా అన్నాడు "వాసన ప్రభూ! కుళ్ళు వాసన!"

"ఎక్కడోయ్?" అడిగారు రాజావారు.

"మన కోట స్టోర్ రూమ్‌లో ప్రభో!"

"ఇక్కడిదాకా వస్తోందా?"

"చిత్తం ప్రభూ! నెల రోజులుగా కొంటున్న కూరగాయలు మొత్తం అక్కడే వున్నాయ్."

"శభాష్! ప్రజలకి బుద్ధొచ్చిందా?"

"ప్రజలకే ఏమిటి ప్రభూ! మాక్కూడా వచ్చేసింది."

"అయితే వెంటనే ఆ కూరగాయలన్నీ కోటగోడ బయట పారేయించేసెయ్."

— విశ్వనాథ పావనిశాస్త్రి

---

**How Strange! How Shocking!**

ఈ పిచ్చివాడిని ఎవరో తీసుకువచ్చారు. అతడు పిచ్చి పిచ్చిగా ఏదో వాగుతున్నాడు. పైగా ఆ వాలకం చూస్తేనే తెలుస్తోంది మెంటల్‌గా స్టెబిలిటీ లేదని.

"నీవు చెప్పింది నిజమేనా?" సహనాన్నంతా కూడగట్టుకుని మెల్లగా అడిగాడు మార్టిన్.

"సాహెబ్! నా వృత్తి మీద ప్రమాణం చేసి చెబుతున్నాను. ఇంత అందమైన నెక్లెస్.. పనితనం.. ఎవరో వృథాచేసి గాజు ముక్కలతో పొదిగిన బంగారపు నెక్లెస్ తయారు చేశారు. చేసిన మనిషి పనితనం మెచ్చుకోతగ్గది. ఈ నగలో బంగారం నిజమైనది. రాళ్ళు గాజుముక్కలు. అందుకనే నేను చెప్పిన ధర బంగారపు విలువ మాత్రమే."

మళ్ళీ అతడికి పట్టరాని నవ్వు వచ్చింది. బహుశా అతడి జీవితంలో ఇంత హాస్యయుతమైన సంఘటన జరిగి వుండకపోవచ్చు. పకపకా నవ్వుతున్నాడు. ఇంత ఘోరంగా ఫూల్ అయిన ఆంగ్లేయులని అతడు చూసి వుండడు అనుకున్నారు.

ఏదైతేనేం! ఈ తమాషాకి నవ్వాలో ఏడవాలో తేల్చుకోవాలి అనుకున్నాడు మార్టిన్ హార్డ్.

"ఏమిటీ నాన్సెన్స్ మార్టిన్?" లిజ్జీ గట్టిగా డిమాండ్ చేసింది.

"కొంచెం ఓపిక పట్టు లిజ్జీ"

గోల్డ్ స్మిత్ వేపు తిరిగి అన్నాడు.

"ఇదిగో చూడు. నీవు అంటున్నది నిజమేనా? ఈ రాళ్ళు నకిలీవేనా?"

సీరియస్‌గా అన్నాడు బనారసీలాల్ "నా పరికరాల మీద ప్రమాణం చేసి చెబుతున్నాను సాహెబ్. ఆ రాళ్ళు గాజు పెంకులే. ఎవరిచ్చారీ నగని మీకు?"

"దేవీపూర్ మహరాజా!"

బనారసీలాల్ సైలెంట్‌గా అయిపోయాడు.

"ఆ రాజా సాహెబ్ దగ్గర గొప్ప వజ్రాలున్నాయి. మొనగాడి రత్నాలున్నాయి. విలువ లేని వైఢూర్యాలున్నాయి. అతడి ఖజానా మించినది ఈ దేశంలో మరొకటి లేదు" ఒప్పుకున్నాడు.

అవును నిజమే. ఈ సంగతి ఇండియాలో అందరికీ తెలుసు. ప్రస్తుత మహరాజాగారి తాతగారు యుధిష్టిర్ సింగ్‌కి ఓ హాబీ వుండేది. ప్రపంచంలోని మారుమూలల నుంచి అక్కడ దొరికే వజ్రాలని, విలువైన రాళ్ళని కొని పోగుచేసేవాడు. కుటుంబపు సంపద నంతటినీ ఈ హాబీ కోసం వెచ్చించి చివరికి ఖజానా కూడా ఖాళీ చేసే ప్రయత్నంలో వుండగా హఠాత్తుగా చనిపోయాడు. వజ్ర వ్యాపారులు ప్రపంచంలోని అన్ని నగరాల నుంచి దేవీపూర్ సంస్థానాన్ని వెతుక్కుంటూ వచ్చేవారు. పారిస్... లండన్... జినోవా... రోమ్... న్యూయార్క్...

అతడికి పోటీ మరో జెమ్స్ కలెక్టర్, హైదరాబాద్ నిజామ్.

పరిస్థితి ఇలా వుండగా గాజు పెంకులతో నెక్లెస్ చేయించి బహూకరించవలసిన అగత్యం మహారాజాకి ఎందుకు కలిగింది? ఈ బహుమతి ఇవ్వకపోయినా కొంపలు మునిగేది లేదే!

మార్టిన్ హార్డ్‌కి యువ మహారాజు బాగా తెలుసు. అతడిది నవనీత హృదయం. హార్డ్ ఆ సంస్థానంలో మూడేళ్ళపాటు సలహాదారుగా పనిచేశాడు. ఆ సంస్థానపు ప్రజల సంక్షేమానికి దోహదం చేసే ఎన్నో కార్యక్రమాలు హార్డ్ మహారాజాకి నచ్చచెప్పి చేపట్టేలా చేశాడు. సంస్థాన ప్రజల దారిద్ర్యం వదిలేలా- ఇరిగేషన్, చెరువులు, కాలువలు, రోడ్స్... ఇతర సంక్షేమ కార్యక్రమాలు ఎన్నో ఆ సంస్థానంలో అమలుపరిచారు. వాటివల్ల ప్రజలు సుఖపడ్డారు. మహారాజాకి ప్రజలలో అభిమానం పెరిగింది. ప్రజలు తమ రాజాని

అంతులేని ప్రేమతో ఆదరించేవారు. దానికి ముఖ్య కారణం హార్డ్ సలహాలని రాజాకి తెలుసు. ఎంతో సిన్సియర్‌గా, బాధ్యతాయుతంగా తనకి సలహాలిచ్చి విధి నిర్వహించిన ఆంగ్లేయుడు హార్డ్ అంటే మహరాజాకి గౌరవం.

అందువల్లనే సతీసమేతంగా కారొలైన్ పెళ్ళికి మహారాజా విచ్చేశారు. ఈ రోజుల్లో అది ఎంతో అరుదైన విషయం. మహారాణి రాజప్రాసాదపు గోడలు దాటదు.

మహారాజు మంచి మనిషి.

హృదయమున్న మనిషి.

అయితే ఈ నకిలీ నగ ఎలా వచ్చింది?

ఏం జరిగిందో హార్డ్ వూహించుకోలేకపోయాడు.

అతడికి తెలుసు. తమ దేవీపూర్ సంస్థానానికి చేసిన సేవలను దృష్టిలో వుంచుకుని